“ఎలా?” అయోమయంగా అడిగింది సీత.

“ఎలాగంటే...” అని బుచ్చిబాబు సీత వాళ్ళింట్లో ఏం చెయ్యాలో వివరంగా చెప్పాడు.

“ఛీ నా వల్ల కాదు బాబూ!” అంది సీత నవ్వుతూ.

“*నీవల్ల కాదంటే మన పెళ్ళి కాదు అంతే!* ఆ తర్వాత నీ యిష్టం. సినిమాల్లో చూడ్డంలేదూ? అంతే ఈ పెద్దవాళ్ళకి అలాగయితేనే నచ్చుతుంది. ప్లీజ్ సీత! సీత మనకోసం ఈ చిన్న పని చేయవూ? మనకోసం కాకపోతే పోనీ నాకోసం” సీత గడ్డం పుచ్చుకుని బ్రతిమలాడాడు బుచ్చిబాబు.

“సరేలే....” సీత ఒప్పుకుంది. “కానీ నేను మీ ఇంట్లో ఉండటానికి మీ అమ్మ నాన్నా ఒప్పుకుంటారా అని?”

“ఆ విషయం నీకు మా అమ్మానాన్నలతో మాట్లాడిన తరువాత చెప్తాను”.

సీత వాచ్ వంక చూసింది.

“అమ్మో చాలా టైమయింది. మా వార్డెన్ ఏడుస్తుంది. మనమింకపోదాం” అంటూ లేచి నిలబడింది. బుచ్చిబాబు కూడా లేచి నిలబడ్డాడు.

ఇద్దరూ ఆ బఠానీలు అమ్మే కుర్రాడిని దాటి ముందుకు కెళ్ళుతుండగా ఆ బటానీల కుర్రాడు ఇలా అన్నాడు “ఏం సార్ ఇంత పిసినిగొట్టువి? నా దగ్గర రూపాయి బటానీలు కొనుంటే నేను వెళ్లిపోయిండేవాడిని కదా. చక్కగా అమ్మగార్ని ముద్దు పెట్టుకుని వుండేవాడివి. ఒక్క రూపాయికోసం ఎంత మంచి ఛాన్సు వదులుకున్నావు సార్! ధూ!”

వాడి మాటలకి సీత ఫక్కుమని నవ్వింది.

బుచ్చిబాబు “ఈ” అని అరుస్తూ బాధగా జుట్టు పీక్కున్నాడు.

0 0 0

“దిక్కుమాలిన వెధవ...సన్నాసి వెధవ.. ఏబ్రాసి వెధవ... మాయదారి వెధవ...”

పచార్లు చేస్తూనే బుచ్చిబాబుని తిడుతునే వున్నాడు పర్వతాలరావు. బుచ్చిబాబు తలవంచుకుని నిల్చున్నాడు.

“పాపం తిట్టకండీ” అంది పార్వతమ్మ.

“తిడ్తానా చీరేస్తానా? మన వంశంలో ఇప్పటిదాకా ఏ వెధవయినా ప్రేమించి పెళ్లి చేసుకున్నాడా అని?” హుంకరించాడు పర్వతాలరావు.

“వెధవలే ప్రేమించరు” నసుగుతూ అన్నాడు బుచ్చిబాబు.

“ఏంటి కూస్తున్నావు?” సరిగా వినిపించక మళ్ళీ అడిగాడు పర్వతాలరావు.

"అబ్బ, మీరు ఊర్కోండి. ఎందుకలా అరుస్తారు? అసలు ఇప్పుడే పెళ్ళి వద్దని అనేవాడు. ఇప్పుడు చేసుకుంటానని అంటున్నాడు. అందుకు సంతోషించండి".

"అవును నా నెత్తిన కిరీటం పెట్టడానికే పెళ్లి చేసుకుంటున్నాడు తింగరి వెధవ"

"అసలు ఆ అమ్మాయెవరో ఏంటో తెలీకుండా వద్దని అరుస్తారేం అర్థం పర్థం లేకుండా?"

"నాన్నగారెప్పుడూ అంతే...సిల్లీగా" అన్నాడు బుచ్చిబాబు .

"సరే చెప్పరా...ఇంతకి అ అమ్మాయిని కన్న వెధవెవడో..." అన్నాడు పర్వతాలరావు.

"సీతవాళ్ళ అమ్మానాన్నలు చిన్నప్పుడే యాక్సిడెంట్లో పోయారు నాన్నా" చెప్పాడు బుచ్చిబాబు.

"అయ్యయ్యో పాపం..! యాక్సిడెంట్ చెసిన వెధవెవడో గానీ..." జాలిపడుతూ అన్నాడు పర్వతాలరావు .

"పాపం----ప్చ్" అంది పార్వతమ్మ .

"చిన్నప్పటినుండి వాళ్ళ మేనమామే ఆమెని పెంచాడు. ఆమె మేనత్త చాలా గయ్యాళిది. చదువు పూర్తయి ఉద్యోగం దొరికేదాకా ఓపికపట్టి తరువాత వర్కింగ్ ఉమెన్స్ హాస్టలో వుండి ఉద్యోగం చేసుకుంటోంది" చెప్పాడు బుచ్చిబాబు.

"మన ఇళ్ళలో ఆడవాళ్ళు ఉద్యోగాలు చేసే ఆనవాయితి లేదు. అయినా ఉద్యోగం చేసే పిల్ల మనకెందుకురా లక్షణంగా కాపురం చేసే పిల్ల కావాలిగానీ..." దీర్ఘాలు తీశాడు పర్వతాలరావు.

"అంటే ఉద్యోగం చేసేవాళ్ళు లక్షణంగా కాపురం చెయ్యరా నాన్నా"

"చక్కగా అడిగావురా బాబూ"

"అయినా మీరు నో అని సిల్లీగా అనడానికి నాకేం కారణం కనిపించడంలేదు నాన్నా"

"చిన్నవాళ్ళు మీకు తెలీదు. పెద్దవాళ్ళం మేమయితే కట్టుబాట్లు సంప్రదాయం అన్నీ చూసి చేస్తాం, నీకు లక్షణంగా వుండే పిల్లను చేస్తాం గానీ పనికిమాలినదాన్ని తెచ్చియివ్వం కదా?" అన్నాడు పర్వతాలరావు .

"జీవితాంతం ఆ అమ్మాయితో కాపురం చేసేది నేనయినప్పుడు పనికిమాలిన అమ్మాయిని చేసుకుని జీవితం నాశనం చేసుకోవాలని నేను కూడా అనుకోను కదా? ఆ అమ్మాయిని మీకు తెచ్చి పరిచయం చేస్తాను నాన్నా. కావాలంటే రెండురోజులు మనింట్లో వుంచుకుని చూడండి. అప్పుడుకూడా ఆ అమ్మాయి నచ్చలేదని మీరంటే నేను చేసుకోను సరేనా?" అడిగాడు బుచ్చిబాబు తల్లిదండ్రులు ఇద్దరి మొహాలవంకా మార్చి మార్చి చూస్తూ.

"మరింకేం? సరేననండి" పర్వతాలరావు భుజాలు పట్టి ఊపుతూ అంది పార్వతమ్మ.

"ఏంటా ఊపడం నా తలపండు ఊడి నేలమీద రాలేలా? ముందా వెధవ చేతులు నా భుజాలనుండి తియ్" అన్నాడు పర్వతాలరావు.

“ఛీ...ఏంటండి అ పాడు మాటలు?” మంగళసూత్రాలు కళ్ళకద్దుకుంది పార్వతమ్మ.

పర్వతాలరావు బుచ్చిబాబువంక చూస్తూ అన్నాడు “సరేనోయ్ వెధవాయ్ అలాగే కానియ్”

బుచ్చిబాబు సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయిపోతూ “థాంక్యూ డాడీ” అన్నాడు.

0 0 0

ఆటో బుచ్చిబాబు ఇంటిముందు అగింది. దాంట్లోంచి సీత, బుచ్చిబాబు దిగారు. బుచ్చిబాబు చేతిలో సూట్‌కేస్‌తో ఇంటివైపు అడుగులు వేశాడు. అతని ప్రక్కనే నడుస్తూ బరువెక్కిన గుండెతో సీత అంది “నాకేంటో భయంగా వుంది”

“భయమెందుకూ? మనమేమయినా రాక్షస కోనలోకి అడుగుపెడుతున్నామా? మా నాన్నగారు కాస్త కఠినంగా మాట్లాడినట్లు అనిపిస్తుంది గానీ ఆయన చాలా మంచివారు. నేను చెప్పినవన్నీ గుర్తున్నాయిగా?” అడిగాడు బుచ్చిబాబు.

సీత ఉన్నాయ్ అన్నట్టు తల ఉపింది. ఇద్దరూ ఇంటి గుమ్మం దగ్గర ఆగారు.

“ఇప్పుడు మనం ఇలా లోపలికి అడుగు పెట్టగానే మా అమ్మ నాన్న మన కోసం ఎదురుచూస్తూ హాల్లోనే కూర్చుని వుంటారు. నేను నిన్ను పరిచయం చెయ్యగానే నువ్వు వాళ్ళిద్దరి కాళ్ళకీ మొక్కు” అన్నాడు బుచ్చిబాబు.

“మరీ అంత యిదిగా కాకా పడుతున్నట్టు చేస్తే బాగోదేమో? నమస్కారం పెడితే చాలదు?” సందేహంగా చూస్తూ అడిగింది సీత.

“చాలదు. మన పెళ్లి జరగడం కోసం కొన్ని కొన్ని నేను చెప్పినట్లు చేయాల్సిందే!! పద” అంటూ లోపలికి అడుగుపెట్టాడు బుచ్చిబాబు.

సీత బితుకు మంటూ అతన్ని అనుసరించింది. బుచ్చిబాబు ఊహించిన విధంగానే పర్వతాలరావు, పార్వతమ్మ హాల్లో సోఫాలో కూర్చుని వీళ్ళకోసం ఆత్రంగా ఎదురు చూస్తున్నారు. బుచ్చిబాబు తన చేతిలోని సూట్‌కేసుని గోడవారగా పెట్టాడు.

సీతని చూడగానే పార్వతమ్మ సోఫాలోంచి లేచి నిలబడి “రామ్మా...రా!” అంది సాదరంగా. పర్వతాలరావు మాత్రం ఆమెని ఎక్స్‌రే కళ్లతో గమనించసాగాడు.

“ఈ అమ్మాయే సీత! మా అమ్మా నాన్నా!!” పరిచయం చేశాడు బుచ్చిబాబు.

అతని నోటి వెంట వాక్యం పూర్తి అయ్యి అవకముందే సీత గభాల్న వంగి వాళ్ళిద్దరి పాదాలకూ నమస్కరించింది. అంత హఠాత్తుగా ఆమె క్రిందకి వంగేసరికి పర్వతాలరావు గబుక్కున కాళ్ళు పైకెత్తి సోఫామీద పెట్టుకున్నాడు.

“ఏంటమ్మా ఇప్పుడు నువు చేసింది?” కళ్ళు మిటకరిస్తూ అయోమయంగా ప్రశ్నించాడు పర్వతాలరావు.

“పరిచయం చేశాను కదా? మీ కాళ్ళకి మొక్కింది నాన్నా!” చెప్పాడు బుచ్చిబాబు.

“అంతేకదా? క్రిందకి వంగి కాళ్ళు పట్టి లాగి పడేస్తుందేమో అని భయపడి చచ్చాను.

నాకేం తెలుసు ఈ రోజుల్లో పెద్దలంటే ఇంత గౌరవము వుండే వాళ్ళుంటారనీ!"

"చాల్లేండి మీది మరీ చోద్యం, నువ్విక లేమ్మా!" అంటు సీతని భుజాలు పట్టి లేవదీసింది పార్వతమ్మ.

"సీతకి పెద్దలంటే గౌరవమే కాకుండా సాంప్రదాయబద్దంగా వుండటం అంటే ఎంతో ఇష్టం నాన్నా" హుషారుగా అన్నాడు బుచ్చిబాబు.

"నువ్వు చెప్పక్కర్లేదు లేవోయ్ వెధవాయ్ నేను చూస్తున్నానుగా? ఆ అమ్మాయికి ఏదిష్టమో, ఏది కాదో నేను తెల్సుకోగలనులే" అన్నాడు పర్వతాలరావు సీత మీద నుండి దృష్టి మరల్చకుండా.

సీత పైట చెరగును భుజాల మీదగా నిండుగా కప్పుకుంది. పార్వతమ్మ కూడా సీతని రెప్పవాల్చకుండా చూడసాగింది. కోలమొహం, పెద్దకళ్ళు, సన్నని ముక్కు, చిన్ననోరు నొక్కుల నొక్కుల జుట్టుతో పెద్దజడ బాగా గంజి పెట్టి ఇస్త్రీ చేసిన బెంగాల్ కాటన్ హాఫ్వైట్ శారీలో పచ్చని శరీర ఛాయతో అందంగా ఉంది సీత.

వాళ్ళిద్దరూ అలా రెప్ప వాల్చకుండా చూస్తుంటే సీతకి ఇబ్బందిగా అనిపించి తల వంచుకుని నేలచూపులు చూడసాగింది.

"చూడమ్మాయ్..." దీర్ఘాలు తీస్తూ అన్నాడు పర్వతాలరావు.

సీత ఆయన వంక చూసింది.

"మా ఇంట్లో ఆడపిల్లలు ఉద్యోగాలు చేసి ఎరుగరు. నువ్వు చూస్తే...." ఏదో చెప్పబోయాడు పర్వతాలరావు.

"పెళ్ళయ్యాక సంసారానికి నా ఉద్యోగం అడ్డమనిపిస్తే మానేస్తానండి" అంటూ అతనిమాట పూర్తి కాకుండానే చెప్పింది సీత.

పర్వతాలరావు తల పంకించాడు. అప్పుడు సాయంత్రం ఆరు గంటలైంది.

0 0 0

రాత్రి భోజనాల దగ్గర....

"ఓహ్ మటన్ బిర్యానీ! అబ్బో చికెన్ ఫ్రయ్!! బాబోయ్ ప్రాన్స్ కర్రీ! హుర్రే ములక్కాడల సాంబార్..." తన ముందున్న అయిటమ్స్ చూసి ఆశ్చర్యంతో ఆనందంతో కేకలు పెడుతున్నాడు పర్వతాలరావు.

"ఏంటీ ఈ వేళ అన్నీ నాకిష్టమైనా అయిటమ్స్ చేసావ్. కొంపదీసి ఈ రోజు నా పుట్టిన రోజో లేకపోతే మన పెళ్ళి రోజో కాదు కదా?" భార్యతో అన్నాడు పర్వతాలరావు.

"చాల్లెండి మీ హాస్యాలు" పార్వతమ్మ సిగ్గు పడుతూ అంది "ఇవన్నీ ఈ అమ్మాయే చేసింది" సీత వంక చూస్తూ అంది.

"ఓ... అలాగా?" కళ్ళు పెద్దవి చేసి సీత వంక చూస్తూ అన్నాడు పర్వతాలరావు.

తర్వాత మెల్లగా అన్ని అయిటమ్స్ రుచి చూశాడు. అతని మొహం విప్పారింది.

"ఓహ్--- అద్భుతం! అన్నీ చాలా బాగున్నాయ్ అమ్మాయ్. అమృతం అనుకో!" సీతని మెచ్చుకోలుగా చూస్తూ అని "పెళ్ళయి ఇన్ని సంవత్సరాలైంది. ఏనాడు నువ్వింత రుచిగా వండి తగలెట్టావా... దరిద్రంగా తగలెడ్తావ్ గానీ?" పార్వతమ్మను మందలిస్తూ అన్నాడు.

"యాహూ" గట్టిగా అరిచాడు బుచ్చిబాబు.

అతని అరుపుకు పర్వతాలరావు ఉలిక్కి పడ్డాడు.

"సడెన్‌గా నీకేమొచ్చిందిరా ఏబ్రాసెదవ?" బుచ్చిబాబు వంక ఆశ్చర్యంగా చూస్తూ అన్నాడు.

బుచ్చిబాబు నాలిక కొరుక్కున్నాడు.

"అంటే ఈ కూరలన్నీ నాక్కూడా నచ్చి సంతోషం పట్టలేక అరిచానన్నమాట!" బుర్ర గోక్కుంటూ అన్నాడు.

0 0 0

మర్నాడు....

తెల్లవారి ఆరు కావస్తోంది. ఇంకా పూర్తిగా చీకట్లు వీడలేదు.

పర్వతాలరావు, పార్వతమ్మలు ఇంకా నిద్ర లేవలేదు. కానీ ఎన్నడూ ఏడు కొట్టందే నిద్ర లేవని బుచ్చిబాబు, సీతలు మాత్రం అప్పుడే నిద్రలేచి మొహాలు కూడా కడుక్కున్నారు. సీతైతే తలకి స్నానం కూడా చేసేసింది.

బుచ్చిబాబు ఓ చీపురూ, ముగ్గు చిప్పా తెచ్చి సీత చేతిలో పెట్టాడు.

"ఊ కానీయ్" అన్నాడు.

సీత అతని వంక ఇబ్బందిగా చూసింది.

"ఇలా బాగుంటుందంటావా?" అడిగింది.

"ఇలాగే బాగుంటుంది సినిమాల్లో చూళ్ళేదూ? ఊ....ఊ....త్వరగా పద. వాళ్ళు నిద్ర లేవకముందేనువ్వు మొదలెట్టాలి!" కంగారు పెట్టాడు బుచ్చిబాబు.

సీత వాకిట్లో నేల మీద చీపురుతో కాస్త ఉడ్చింది. తర్వాత కళ్ళాపి చల్లింది. అ తర్వాత ముగ్గు చిప్ప పట్టుకుని గొంతుక్కూచుంది. బుచ్చిబాబు చాటుగా నిలబడి ఆత్రంగా చూడసాగాడు.